క్లుప్తంగా

సమాచార హక్కు చట్టంతో సత్ఫలితాలు



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి విజయ్‌కుమార్

కొండపి (సింగరాయకొండ): సమాచార హక్కు చట్టం ద్వారా ప్రభుత్వ శాఖ నుంచి పౌరులకు కావాల్సిన సమాచారాన్ని తెలుసుకోవచ్చని వ్యవసాయాధికారి డి. విజయ్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. డీటీ సుజాత మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం కోసం దరఖాస్తు రుసుం గ్రామస్థాయిలో ఉచితమన్నారు. మండలస్థాయిలో రూ.5, జిల్లా స్థాయిలో రూ.10 చెల్లించాల్సి ఉంటుందన్నారు. మండల స్థాయి అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ

హనుమంతునిపాడు: మొక్కల సంరక్షణ అందరి బాధ్యతగా తీసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ కేవీ కృష్ణారావు అన్నారు. స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. పరిసరాలను శుభ్రం చేసి మొక్కలు నాటారు. స్వచ్ఛ గ్రామాలుగా తయారు చేసేందుకు అందరం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈఓఆర్డీ షేక్ మస్తాన్ షరీఫ్, ఎంపీటీసీ ఉడుముల వెంకట సుబ్బారెడ్డి, సర్పంచ్ రాజారావు, సచివాలయ సిబ్బంది, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు తప్పక పాటించాలి



వాహనదారులకు సూచనలిస్తున్న ఎస్సై కిషోర్‌బాబు

పామూరు: నిబంధనలు అతిక్రమించి వాహనాలను నడిపితే చర్యలు తీసుకుంటామని ఎస్సై టి.కిషోర్‌బాబు అన్నారు. స్థానిక 565 జాతీయ రహదారి వద్ద గురువారం సాయంత్రం వాహనాలను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు విధిగా వాహనానికి, డ్రైవర్‌కు లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనం నడిపినా, అధిక లోడ్‌తో వాహనం నడిపినా చర్యలు తప్పవన్నారు. వాహనాల్లో అక్రమంగా మద్యం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పోలీస్‌సిబ్బందికి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చూడాలని సూచించారు.

చిన్న వెంకటరెడ్డి మృతదేహానికి నివాళి



చిన్న వెంకటరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న దద్దాల భార్గవి

వెలిగండ్ల: మండలంలోని తమ్మినేనిపల్లి గ్రామానికి చెందిన కర్నాల చిన్న వెంకటరెడ్డి మృతదేహానికి వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల మంజు భార్గవి గురువారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, మాజీ ఏఎంసీ డైరెక్టర్ దద్దాల రాములు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం

కందుకూరు రూరల్: స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది విజయవాడ, వరద బాధితుల సహాయార్థం విరాళాలు సేకరించారు. ఈ నగదును ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి సీఎం సహాయ నిధికి అందజేశారు. బోధన, బోధనేతర సిబ్బంది ఒక రోజు వేతనం రూ.1,10,987, అదే విధంగా కళాశాలలోని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వలంటీర్లు, కళాశాల విద్యార్థులు, పుర ప్రజల నుంచి రూ.12,073 సేకరించినట్లు ప్రిన్సిపాల్ ఎం.రవికుమార్ తెలిపారు. మొత్తం రూ.1,23,060 ఎమ్మెల్యేకు అందించినట్లు తెలిపారు. ఐక్యూసీ కో ఆర్డినేటర్ పి.రాజగోపాల్ బాబు, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ కోటపాటి నరేష్ రాజా, షేక్ షానాజ్ బేగం, లైబ్రేరియన్ గడ్డం బ్రహ్మయ్య పాల్గొన్నారు.

రైతుల చూపంతా.. పొగాకు వైపే..!

పొగాకు సాగు సిరులు కురిపిస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా గత ఏడాది రికార్డు స్థాయిలో ధరలు నమోదయ్యాయి. దీంతో రైతులు ఇతర పంటల సాగును వదిలేసి అధిక మొత్తంలో పొగాకుకు సాగుకు మొగ్గు చూపుతున్నారు. మండలంలో గతంలో 1500 నుంచి 2వేల హెక్టార్లలో సాగయ్యే సాగు విస్తీర్ణం ఈ ఏడాది 3,500 హెక్టార్లలో సాగు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పెట్టుబడి భారీగా పెరిగినా రైతులు వెనుకాడటం లేదు.

- భారీ లాభాల నేపథ్యంలో పొగాకు సాగుకే రైతుల మొగ్గు
- గతంలో ఎన్నడూ లేని విధంగా 3,500 హెక్టార్లలో సాగుకు సన్నాహాలు
- తగ్గిన మిర్చి సాగు విస్తీర్ణం
- భారీగా పెరిగిన భూములు, బ్యార్నీ కౌలు ధరలు
- పొగనారు ధరలకూ రెక్కలు



రేగలగడ్డలో పీకుడుకు సిద్ధమైన పొగనారుమడి

మర్రిపూడి: మండలంలో వాణిజ్య పంటగా పొగాకు సాగు దశాబ్దాలుగా ఆనవాయితీగా వస్తోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పొగాకు సాగు ఊహించని లాభాలను తెచ్చిపెట్టింది. దీంతో మండలంలో అధిక శాతం మంది పొగాకు సాగుపై మక్కువ చూపుతున్నారు. మిరప పంట తగ్గించి పొగాకు సాగుపై రైతులు దృష్టిపెట్టారు. ఈ ఏడాది సీజన్ ప్రారంభంలోనే అడపా దడపా వర్షం కురవడంతో రైతులు సేద్యాలు చేసి భూమిని సిద్ధం చేసి పెట్టారు. గత రెండు రోజులుగా మండలంలో వర్షాలు కురవడంతో గుండ్లసముద్రం, వల్లాయపాలెం, శివరాయునిపేట తదితర గ్రామాల్లో పొగమొక్కల పనులు ప్రారంభమయ్యాయి.

భారీగా పెరిగిన పొగాకు సాగు విస్తీర్ణం

గత ఏడాది మండలంలో సుమారు 3 వేల హెక్టార్ల లోపే పొగాకు సాగు చేపట్టారు. కానీ ఏడాది గతంలో ఎన్నడూ లేని విధంగా 3,500 హెక్టార్లలో సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం లేకపోలేదు. ఈ ఏడాది పెట్టుబడులు పెరిగినా వెరవకుండా సాగుకు సిద్ధమవుతున్నారు. గత ఏడాది ఊహించని విధంగా కేజీ పొగాకు రూ.350 దాటడటం, సరాసరి ధరలు గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో నమోదు కావడం రైతులకు సిరులు కురిపించాయి. ఇటీవల అడపా దడపా వర్షాలు కురవడంతో రైతులు సేద్యాలు చేసుకొని పొలాలు సిద్ధం చేసుకున్నారు. పొగనారు కోసం ఇతర ప్రాంతాలకు పరుగులు తీస్తున్నారు.

పొగనారుకు రెక్కలు..

భూములు పదునెక్కి అదును కావడంతో పొగనారు మూట్లకు రెక్కలొచ్చాయి. మూటనారు ధర రూ.1600 నుంచి రూ.2000 వరకు పలుకుతోంది. ఒక్కసారిగా నారుమూట్ల ధరలు పెరిగిపోయినట్లు రైతులు చెబుతున్నారు. అధిక ఖర్చులు వెచ్చించి రాజమండ్రి నారు తీసుకొస్తే నారు కుళ్లిపోవడం, మొక్కల్లో మల్లె రావడం మొక్క కాండం విరిగిపోవడంలాంటి సమస్యలు తలెత్తుతున్నాయని, దీంతో పొన్నలూరు, జరుగుమల్లి, కొండపి తదితర ప్రాంతాలతో పాటు మండలంలో అందుబాటులో ఉన్న గ్రామాల్లో నారు తెచ్చి నాటుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

బ్యార్నీ కౌలు రూ.2 లక్షలు

గత ఏడాది పొగాకుకు వచ్చిన ధరలు చూసి ఈ ఏడాది కౌలు ధరలు భారీగా పెరిగాయి. గత ఏడాది బ్యార్నీ కౌలు రూ.1.20 లక్షలు ఉండగా ఈ ఏడాది రూ.2 లక్షలకు పైనే పలుకుతోంది. గత ఏడాది ముఠాకు రూ.2.50 లక్షలు ఉండగా ఈ ఏడాది రూ.4.20 లక్షలు పలుకుతోంది.

120 ఎకరాల్లో నారుమళ్లు

మండలంలోని కూచిపూడి, జువ్విగుంట, రావిళ్లవారిపాలెం, తంగెళ్ల, అయ్యపురాజుపాలెం, వెంకటకృష్ణాపురం, గుండ్లసముద్రం, రేగలగడ్డ తదితర ప్రాంతాలల్లో పొగనారుమళ్లను సిద్ధం చేశారు. దాదాపు 120 ఎకరాల్లో నారుమళ్లు పెంచారు. కొందరు రైతులు బురదయాత వేయగా, మరికొందరు రైతులు పొగమొక్కలు నాటేందుకు నీరు అవసరం కావడంతో కుంటలు, కాలువల్లో నీరు ట్రాక్టర్ ట్రక్కుల సహాయంలో సుదూరం నుంచి నీరు తెచ్చుకొని మొక్కలు నాటుకుంటున్నారు.

కూలీలకు పెరిగిన డిమాండ్

మండలంలో పొగమొక్కలు సీజన్ ప్రారంభం కావడంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. పురుషులకు రూ.800, మహిళలకు రూ.500 కూలి ఇస్తున్నారు. గ్రామాల్లో కూలీలు అందుబాటులో లేకపోవడంతో పక్క గ్రామాల నుంచి కూలీలను రవాణా చార్జీలు భరించి తీసుకువస్తున్నారు.



శివరాయునిపేటలో పొగమొక్కలు నాటుతున్న కూలీలు



రావెళ్లవారిపాలెంలో సిద్ధం చేసిన లేత పొగనారుమడి

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం

పీసీపల్లి: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై జి.కోటయ్య అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు నూతన చట్టాలు, ప్రస్తుతం జరుగుతున్న నేరాలు, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో యువత ఎక్కువగా మాదక ద్రవ్యాలకు అలవాటు పడి భావిజీవితాన్ని ఛిద్రం చేసుకుంటున్నారన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారం ఉంచడం ద్వారా బ్లాక్ మెయిల్ వేధింపులకు గురవుతున్నారని, వీటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు చట్టాలను వివరిస్తున్న ఎస్సై కోటయ్య

అంగన్‌వాడీల్లో ఆరోగ్యకర విద్య

- బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి

కనిగిరి రూరల్: పౌష్టికాహార లోపాన్ని నివారించి ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడమే లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు బాల్యం నుంచి మంచి పౌష్టికాహారంతో పాటు సత్ ప్రవర్తనతో కూడిన విద్య, మానసిక, శారీరక ఎదుగుదలకు దోహదపడుతున్నట్లు చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేస్తున్న పౌష్టికాహార కిట్ల గురించి వివరించారు. సీడీపీఓ పి.సరోజిని అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆర్డీఓ పి.జాన్ ఇర్విన్, మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ఎంఈఓల సంఘ జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి, ప్రిన్సిపాల్ సయ్యద్ హసీనా బేగం, ఎంఈఓలు యువీ నారాయణరెడ్డి, సూపర్‌వైజర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి

వరద బాధితులకు విరాళం

కనిగిరి రూరల్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం కనిగిరి మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా మెడికల్ అసోసియేషన్‌కు రూ.55 వేల విరాళం అందజేశారు. పీడీడీడీఏ అసోసియేషన్ కనిగిరి శాఖ సమావేశం గురువారం కనిగిరిలో జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి వేమూరి సుబ్బారావు పలు అంశాలపై మాట్లాడారు. అనంతరం సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం సాయి ప్రణీత్, ప్రధాన కార్యదర్శి వేమూరి సుబ్బారావు, కోశాధికారి కె.సతీష్‌కుమార్‌లకు కనిగిరి అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.55 వేల సాయం అందజేశారు. కనిగిరి శాఖ అధ్యక్షుడు దరిశి వెంకట సుబ్రహ్మణం, కార్యదర్శి వాగిచర్ల వెంకటేశ్వర్లు, కోశాధికారి బి.ప్రభాకర్, నాయకులు వలేటి మురళి, పాతకోట శివారెడ్డి, కాసు సుబ్బారెడ్డి, మాల కొండస్వామి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీడీడీఏ జిల్లా కార్యదర్శి వేమూరి సుబ్బారావు

విద్యార్థుల రాకపోకలకు ఉపాధ్యాయుల ఆర్థికసాయం

సీఎస్‌పురం(పామూరు): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రవాణా ఖర్చులకు ఉపాధ్యాయులు ఆర్థికసాయం అందజేయడం అభినందనీయమని అంబవరం కాంప్లెక్స్ చైర్మన్ ఆర్.హనుమంతరావు అన్నారు. మండలంలోని చెన్నపునాయునిపల్లె ఎంపీయూపీ పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో పాఠశాల విద్యార్థుల రాకపోకలకోసం పాఠశాల ఉపాధ్యాయులు ఇచ్చిన విరాళం చెక్కును కాంప్లెక్స్ చైర్మన్ వాహన యజమానికి అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చెన్నపునాయునిపల్లి ఎంపీయూపీ పాఠశాలకు 9 కిలోమీటర్ల దూరంలోని అటవీ ప్రాంతంలోని మైలుచెర్ల గ్రామం నుండి నిత్యం 9 మంది విద్యార్థులు పాఠశాలకు వస్తారు. నిత్యం నడిచి రాకపోకలకు కష్టం కావడంతో ఉపాధ్యాయులు తమ సొంత నిధులతో ఆటో సదుపాయం కల్పించారు. పాఠశాలలోని ఉపాధ్యాయులు హెచ్ఎం చాంద్‌బాషా, షరీఫ్ అహ్మద్, లక్ష్మి, సిద్ధయ్య, మధుబాబు, దుర్గాప్రసాద్, నాగమల్లేశ్వరి, మాధవిలు సమకూర్చి ఆటో యజమానికి అందజేశారు.



చెక్కు అందజేస్తున్న ఉపాధ్యాయులు

బదిలీపై వెళ్తున్న అధికారులకు సన్మానం



అధికారులను సన్మానిస్తున్న సంఘ నాయకులు

కనిగిరి రూరల్: ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఫారెస్ట్ రేంజర్ రామిరెడ్డి, సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్ రవికుమార్‌ను ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కనిగిరి శాఖ ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఘనంగా సన్మానించారు. విధి నిర్వహణలో ఉన్నత సేవలందించారని కొనియడారు. మంద్రు రమేష్, ఎస్‌కే మస్తాన్ వలి, సుబ్రహ్మణ్యం, గోపినాథ్ పాల్గొన్నారు.

ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ సంఘాల నాయకులు

కనిగిరి రూరల్: చాకలి ఐలమ్మ 129వ జయంతి వేడుకలను గురువారం రాత్రి స్థానిక రజక సంఘ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సాయుధ పోరాటంలో మహిళా శక్తిని చాటిన వీర వనిత చాకలి ఐలమ్మ అని కీర్తించారు. తొలుత చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు దేపూరి వెంకటేశ్వర్లు, సుబ్బారావు, పల్లా మాలకొండ్రాయుడు, చెరుకూరి చిన కాశయ్య, చింతలపూడి వాసు, నాగయ్య, సుబ్బయ్య, వెంగయ్య పాల్గొన్నారు.

రెవెన్యూ కార్యాలయాన్ని పరిశీలించిన జేసీ



రెవెన్యూ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న జేసీ

టంగుటూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయాన్ని జేసీ గోపాలకృష్ణ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయ పరిసరాలు, రికార్డులు, పరిశీలించారు. కార్యాలయంలో అసంపూర్తిగా ఉన్న విద్యుత్ వైర్లను పరిశీలించి..అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సర్వేయర్ రికార్డు గదిని పరిశీలిస్తున్న సమయంలో పట్టాదారు పాసుపుస్తకాలు చెల్లాచెదురుగా కిందపడి ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వీఆర్‌ఓలు ఎంత మంది ఉన్నారు, ఎక్కడెక్కడ విధులు నిర్వహిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. వీడియో కాన్ఫరెన్సుకు సంబంధించిన ఉపకరణాలు లేకపోవడంతో తహసీల్దార్‌ను అడిగారు. 2020 నుంచి వీడియో కాన్ఫరెన్సుకు సంబంధించిన ఉపకరణాలు లేకపోవడంతో కాన్ఫరెన్సుల సమయంలో పక్క మండలాలకు వెళ్లాల్సి వస్తుందని బదులిచ్చారు. వెంటనే స్పందించిన జేసీ సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వారం రోజుల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యాలయానికి రంగులు వేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నిరుపయోగంగా ఉన్న జనరేటర్‌కు మరమ్మతులు చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ ఆంజనేయులు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనాథ్, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ మాధవి, సీనియర్ అసిస్టెంట్ రమణయ్య, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

విహార యాత్రలతో విజ్ఞానం

సీఎస్‌పురం(పామూరు): విద్యాపరమైన విహార యాత్రలు విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందిస్తాయని కదిరి బాబూరావు వ్యవసాయ, ఉద్యానవన కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ బసవరాజు, స్టెఫీ అన్నారు. దక్షిణ భారతదేశ విద్యావిహార యాత్రలో భాగంగా మండలంలోని శీలంవారిపల్లెలోని కదిరి బాబూరావు వ్యవసాయ, ఉద్యానవన కళాశాలల విద్యార్థులు గురువారం కర్నాటక రాష్ట్రంలోని మండ్యాలో వి.సీ.ఫామ్, తమిళనాడులోని ఊటీ, కొడైకెనాల్ ప్రాంతాల్లోని వ్యవసాయ క్షేత్రాలను, విద్యాలయాలను సందర్శించారు. ఈసందర్భంగా ఆయా రాష్ట్రాల్లో వ్యవసాయ విద్యావిధానం, వ్యవసాయం సాగు, ఆధునిక పద్ధతులు మొదలైన వాటిపై స్థానిక ప్రొఫెసర్లు, విద్యార్థులు, రైతులతో మాట్లాడి పలు అంశాల్లో అవగాహన పొందారన్నారు.



కర్నాటకలో విహారయాత్రలో కదిరి వ్యవసాయ కళాశాల విద్యార్థులు

1437 పొగాకు బేళ్లు కొనుగోలు

కొండపి (సింగరాయకొండ) : కొండపిలోని స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం నిర్వహించిన వేలంలో పొగాకు సరాసరి ధర రూ 279.69 పలికిందని వేలం నిర్వహణ అధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. అక్కచెరువుపాలెం, గోగినేనివారిపాలెం, పైడిపాడు గ్రామాలకు చెందిన రైతులు 1701 ఒక బేళ్లను వేలానికి తీసుకొని రాగా అందులో 1437 బేళ్లు కొనుగోలు అయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 264 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ఠ ధర కేజీ రూ 358, కనిష్ఠ ధర కేజీ రూ 169, సరాసరి ధర రూ 279.69. వేలంలో 13 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో గురువారం జరిగిన వేలంలో అత్యధిక ధర రూ. 358 పలికింది. టంగుటూరు, జరుగుమల్లి, వావిలేటిపాడు, సాధువారిపాలెం, కాకుటూరివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 931 బేళ్లను వేలానికి తీసుకురాగా 746 బేళ్లను కొనుగోలు చేసి 185 బేళ్లను తిరస్కరించారు. గరిష్ఠ ధర రూ.358, కనిష్ఠ ధర రూ.190, సరాసరి రూ.268.43 పలికింది. వేలంలో 45 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులంతా శీడల గిడ్డంగుల్లో ఉన్న మొత్తం బేళ్లను కేంద్రానికి తీసుకువచ్చి అమ్ముకోవాలని కోరారు.



పొగాకు వేలంలో పాల్గొన్న వ్యాపారులు

మృతుని కుటుంబానికి చెక్కు అందజేత

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని చెన్నపునాయునిపల్లె ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్‌జీటీ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న తమ్మినేని చెంచిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈసందర్భంగా గురువారం స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్ద మృతుని కుమారునికి యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ పథకం కింద రూ.1.50 లక్షల ఆర్థిక సాయం చెక్కును ఎంఈఓ జె.ప్రసాదరావు అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు జవంగుళ వెంకటరావు, ఎస్‌కే.పాదుషాలు మాట్లాడుతూ యూటీఎఫ్ సంక్షేమ పథకం యూటీఎఫ్ సభ్యులకు ఆపన్నహస్తం వంటిదన్నారు. ముందుగా చెంచిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పథకం కన్వీనర్ ఎస్.తిరుపతయ్య, మండల గౌరవ అధ్యక్షుడు జి.వేమనారాయణ, సంఘ సీనియర్ నాయకులు ఎస్.వెంకట్రామయ్య, పి.నాయబ్‌రసూల్, జి.శ్రీనివాసరాజు, వి.సాంబశివరావు, ఐ.కొండయ్య, ఎం శ్రీనివాసులు, ఎం కిరణ్‌కుమార్, జి.రవిబాబు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సంక్షేమ చెక్కు పంపిణీచేస్తున్న సంఘ నాయకులు

పౌష్టికాహారం సంపూర్ణ ఆరోగ్యదాయిని

సీఎస్‌పురం(పామూరు): అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేసే పౌష్టికాహారం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యదాయిని అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.దేవకృపావరం, బ్లాక్ కో ఆర్డినేటర్ గంథం సామ్యేలు అన్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గర్భందాల్చిన నాటి నుంచి అంగన్‌వాడీ కేంద్రంలో తమ పేరు నమోదు చేసుకుని పౌష్టికాహారం పొందాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు ఇచ్చే సలహాలు, సూచనలు పాటించాలన్నారు. బాలింతలు, చిన్నపిల్లలు పౌష్టికాహారం సమయపాలన పాటిస్తూ క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. కేంద్రంలో రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేసి కేంద్ర నిర్వహణలో సమయపాలన పాటించాలని సూచించారు. ప్రధాన వీధుల్లో అవగాహన ర్యాలీ చేపట్టారు. డీఐఓ సయ్యద్ రసూల్, వి.సరళారెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పౌష్టికాహార ఆవశ్యకతను వివరిస్తున్న సూపర్‌వైజర్

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు



జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సింగరాయకొండ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి అండర్ ఫెన్సింగ్, యోగా పోటీలు నిర్వహించారు. పోటీల్లో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోధ్యాయురాలు కె.మహాలక్ష్మి తెలిపారు. ఫెన్సింగ్‌లో షేక్ షేక్ హంషీరా, ఎం చిత్రభాను, ఏఎం తన్మయి, డి.కార్తీక, ఏ దేవశ్రీతన్వి, యోగా పోటీలలో ఎం గౌరి, షేక్ తమ్రీన్, వై ముకుంద, షేక్ నాషీన్, ఏ దేవశ్రీతన్వి, ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎల్ లావణ్య వివరించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను అభినందించారు.

జిల్లా స్కూల్ గేమ్స్ క్రీడా పోటీలకు ఎంపిక

టంగుటూరు: నియోజకవర్గ స్కూల్ గేమ్స్ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన 10 మంది విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సింగరాయకొండ ఉన్నత పాఠశాలలో గురువారం వాలీబాల్, ఖోఖో, కబడ్డీ క్రీడల్లో ప్రతిభ చాటి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల పీడీ అరుణ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.